# (ఆత్మ) వంచన

సాయంత్రం ఆరు గంటలు కావస్తోంది.

ఆఫీసు నుండి ఇంటికి వచ్చిన రఘు హడావుడిగా బట్టలేసుకున్నాడు సినిమా టైం అవడంతో.

రఘు భార్య కమల పుట్టింటి కెళ్ళడంతో ప్రస్తుతం ఒంటరిగా సినిమా ప్రోగ్రాం వేసుకున్నందుకు కించిత్ బాధ కలిగినా తప్పదనుకుని ఇంటికి తాళం వేస్తున్నాడు రఘు.

"ఏమండీ" కోకిలవంటి కంఠం వినిపించగా వెనక్కి తిరిగి చూశాడు చేతిలో పని ఆపి.

తన వెనుకగా అందమైన రూపవతి నిలబడి వుంది. ప్రశ్నార్థకంగా చూచాడు ఆమె వైపు.

"కమల అని నా కాలేజీమేట్ ఇక్కడుండాలి? ఈ ఇంటి అడ్రసే ఇచ్చింది" అంటూ నసిగింది.

"కమల భర్తను నేను. కమల పుట్టింటి కెళ్ళింది" అంటూ అసహనంగా టైం చూసుకున్నాడు రఘు.

"ఎక్కడికో ప్రయాణ మైనట్లున్నారు" అడిగింది.

"సినిమాకు పోవాలనుకున్నాను. ఇంతకీ మీ అడ్రస్ ఇవ్వండి. కమల వచ్చిన తర్వాత ఆవిడతో చెబుతాను" అడిగాడు.

"మాది ఈ ఊరు కాదండీ, ఇక్కడ తెలిసిన వాళ్ళెవరూ లేరు కమల తప్ప. రేపు ఉదయం ఉద్యోగానికి ఇంటర్వ్యూ ఉంది. అందుకే ఈరోజు వచ్చాను" అంది.

పాపం అనుకున్నాడు రఘు. సమయానికి కమల లేదు. రాత్రికి ఎక్కడుంటుంది. తన రూమ్‌లోనే ఉండమంటే...

అమ్మో ఇంకేమైనా ఉందా! కమలకి తెలిస్తే లేనిపోని గొడవలు. అయినా ఈవిడ ఉంటుందా. చూస్తే అభిమానం కలదానిలా అనిపిస్తోంది.

ఆమె వైపు ఇబ్బందిగా చూచాడు అడకత్తెరలో చిక్కుకున్న పోకచెక్కలా.

అటు చూస్తే తన అభిమాన హీరో నటించిన చిత్రం. అందునా తొలిరోజు చూడకుంటే తన మనస్సు నిలవదు. ఇటుచూస్తే ఎంతో దూరం నుండి వచ్చిన తన భార్య స్నేహితురాలు అందునా ఆడపిల్ల.

"మీకు అభ్యంతరం లేకుంటే ఈ రోజు మీ రూమ్‌లోనే ఉంటాను" అంది, కమల లేనందుకు నొచ్చుకుంటూ ఆమె. 'అలాగే' అన్నాడు అన్యమనస్కంగా, సినిమా కాన్సిల్ అవుతుంటే బాధతో.



రఘు ఆలోచన పసిగట్టినట్లుంది ఆవిడ.

"నేనూ వస్తాను పదండి సినిమాకు. మీకు డిసప్పాయింట్‌మెంట్ ఎందుకు కల్గించాలి" చెప్పింది.

తేలిగ్గా ఊపిరి పీల్చుకున్నాడు రఘు. టైం ఆరుంపావు అయింది. థియేటర్ దగ్గరే అయినా నడిచి వెళితే టైంకి పోలేము. రెండు రిక్షాలు పిలిచాడు రఘు.

"ఎందుకండీ అనవసరంగా రెండు రిక్షాలు. ఒకే రిక్షాలో పోదాం. నేనేమీ అనుకోను లెండి" నవ్వుతూ అంది.

ఇద్దరూ ఒకే రిక్షాలో కూర్చున్నారు. ఒకరి భుజాలు ఒకరికి తగులుతూంటే ఎంతో హాయిగా ఉంది రఘుకు. నెల రోజుల నుండి ఒంటరిగా ఉన్నందున రఘులోని కోర్కెలు చెలరేగాయి. అయినా మనస్సును అదుపులో ఉంచుకుంటున్నాడు సభ్యత కాదని. దారిలో తెలుసుకున్నాడు ఆమె పేరు జలజాక్షి అని. పేరుకు తగ్గట్టే ఎంత అందమైన కళ్ళు ఆమెవి. ఆమె విగ్రహాన్ని మెచ్చుకోకుండా ఉండలేక పోయాడు కళాపిపాసియైన రఘు.

సినిమాలో కూర్చున్నాడన్న మాటే గాని మనస్సు, శరీరం గాలిలో తేలిపోతున్న అనుభూతికి లోనవుతున్నాడు రఘు. అప్సరస వంటి అందగత్తె తన పక్కన, కూర్చొని ఉంటే ఏ మగాడికి శరీరం స్వాధీనంలో ఉంటుందండీ?

మెల్లగా ఆమె మీద చెయ్యివేశాడు రఘు. భయంగా ఉంది మనస్సులో, వ్యవహారం బెడిసి కొడుతుందేమోనని. ఆమె రఘువైపు చూచి నవ్వింది సుతారంగా. థియేటర్లోని చీకట్లో ఆమె తెల్లటి పల్వరుస తళుక్కుమంది.

ఎలాగోలా సినిమా అయిపోయిందనిపించి థియేటర్ బయటి కొచ్చారు. ఆకాశం మేఘావృతమై ఉంది. చిన్నచిన్న జల్లులు

# మినీ కథ

పడుతున్నాయి. ఒక రిక్షా పిలిచి అందులో కూర్చున్నారు. రఘుకు కాస్త ధైర్యం వచ్చింది. రిక్షాలోనే ఆమె నడుంచుట్టూ చెయ్యి వేశాడు. వదిలించుకోలేదు సరికదా ఇంకా దగ్గరికి జరిగింది. పెద్ద కుదుపుతో ఆగింది రిక్షా.

త్వరగా ఇల్లు వచ్చినందుకు తిట్టుకుంటూ రిక్షా దిగాడు జలజ వెంటరాగా. వర్షం కాస్త పెద్ద దవుతూంది. రూమ్‌లోనికి పోయి, దారిలో హోటల్‌లో ప్యాక్ చేయిం కొచ్చిన భోజనం తిన్నారు ఇద్దరూ. చెరొక మంచంపై పడుకున్నారు ఆలోచిస్తూ. క్రమేణా వర్షంతోపాటు ఉరుములు, మెరుపులు కూడా ఎక్కువయ్యాయి. పెద్ద శబ్దం చేస్తూ ఉరిమింది.

ఉలిక్కి పడింది భయంతో జలజాక్షి. "ఏమండీ భయమేస్తూంది. నేనూ మీ మంచం పైకి రానా" అంది జలజాక్షి. రఘు మౌనంగా ఉండడంతో వచ్చి అతని పక్కన పడుకుంది. భయంకరంగా ఉరుము వినబడటంతో కెవ్వున అరిచి రఘును కరుచుకు పోయింది జలజాక్షి.

అదును కోసం కాచిఉన్న రఘు మరింత గట్టిగా కౌగిలించుకున్నాడు ఆమెను.

పుటుక్కున కరెంటు పోవడంతో చీకటి రాజ్యమేలింది. ఇద్దరి బట్టలు మంచంక్రింద గుట్టగా పడిపోయాయి. స్వర్గలోక తీరాలకు ప్రయాణించారు ఇద్దరూ ఆరాత్రంతా.

* * *

బాలభానుని లేత కిరణాలు రఘు అందమైన మోమును ప్రేమతో స్పృశించగా మెలుకువ వచ్చి లేచాడు రఘు ఆవలిస్తూ. అప్పుడు గుర్తుకు వచ్చింది తను దాదాపు నగ్నంగా ఉన్నానని. పక్కన జలజాక్షి లేదు. లేచి లుంగీ ధరించి బాత్ రూమ్‌కు పోతున్నాడు రఘు. అప్రయత్నంగా టేబుల్ మీదికి దృష్టి సారించి ఉలిక్కి పడ్డాడు. అక్కడుండవలసిన సూట్‌కేస్ లేదు. గుండె ఆగినంత పనైంది. ఇల్లంతా వెతికినా జలజాక్షి జాడలేదు. ఒక్కొక్క ప్రదేశమే దోసిపోయినట్లుగా అనిపించ సాగింది. దాదాపు అయిదు వేల రూపాయలు జలజాక్షార్పణం తన పర్సుతో సహా. కుప్పకూలి పోయాడు రఘు. "ఎంత మోసం చేసింది తనను" మనస్సులోనే తిట్టుకుంటూ బజార్న పడ్డాడు అప్పుకోసం, భార్యామణి వచ్చే సరికి (పోయిన) అన్ని వస్తువులు సమకూర్చాలిగా మరి.

–పి.ఆర్. జనార్ధనరెడ్డి (ఇందు)



## 'ఈవారం ఎన్నికైన కథలు'

1) తిరగబడినకథ – యం. ఐ కిషన్ అశ్వారావుపేట
2) భ్రమ – షహనాజ్ బతుల్, హైదరాబాద్
3) సినిమా (మ) చందమామ (పేరడి) – సూరంపూడి విశ్వం, తణుకు
4) ది టెలుగుఫిలిం – మంపాక శ్రీనివాసరావు, శ్రీశైలం
5) ఇదే నా కోరిక – అమృత, కాకినాడ
6) పెళ్ళాన్ని చంపేయాలి – కె. శ్రీనివాసరావు, పెందుర్తి
7) స్త్రీ జనపూజితం....ఆయుధరాజం (వ్యాసం) సుధాలహరి, విజయనగరం
8) దూరవాణి – ఆర్. శ్రీనివాస్, (చిరునామా పంపలేదు)
9) దటీజ్ మహాత్మా – శ్రీ గోపీమాధవ్, భీమవరం
10) జర్నీ – వై. జ్యోతి, (చిరునామా పంపలేదు)

## పద్దెపల్లి పదాలు

పరసతుల అందాలపడి
చూడనెంచగా
పరుగెత్తబోవకే మనసా!
ఓరగాచూసినా నీసతిని ఎవడైన
ఓర్వాలేవను నిజం తెలుసా!

*

అవనిలో అతిపెద్ద అందాలరూపాలు
ఆడదైశ్వర్యమ్మె మనసా!
అన్నదమ్ములనైన ఆలుబిడ్డలనైన
అవలీల విడదీయు తెలుసా!

*

పొగడువానికె ఎపుడు
పొగడపువ్వుల దండ
పొందిక కలిగేను మనసా!
కాని పొడిడేవాడి గుండెలో
కదలాడు
కల్మషమ్ములు నీకు తెలుసా!



